# తెలంగాణ రాకుంటే రాష్ట్రం మరో బీహార్‌లా మారేది : మంత్రి గంగుల



కరీంనగర్, సెప్టెంబర్ 4: తెలంగాణ రాష్ట్రం రాకుంటే మరో బీహార్‌లా మారి, వలసలతో వల్లకాడు అయ్యేదని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో 174 మంది ముస్లిం మైనార్టీలకు వందశాతం సబ్సిడీతో రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం రెవెన్యూ గార్డెన్స్‌లో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఎన్‌ఎన్, అలింకో సంస్థల సౌజన్యంతో దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల పంపిణీని ప్రారంభించి, పలువురికి అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి పాలనలో తెలంగాణ ప్రాంతం వివక్షకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు ఈ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కరువు కాటకాలు విలయతాండవం చేయగా, ప్రైవేట్ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాలేని దుస్థితి నెలకొని ఉండేదన్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనతో సస్యశ్యామలంగా మారిందన్నారు. ప్రశాంత ప్రపంచ ప్రఖ్యాతి చెందిన అమెజాన్, గుగుల్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తుండగా, యువతకు తెలంగాణ రాష్ట్రం ఉపాధి హబ్‌గా మారుతున్నదన్నారు.

సీమాంధ్ర పాలకుల తీరుతో 2014కు ముందు ముస్లింల పరిస్థితి కడుదయనీయంగా ఉండేదని, సీఎం కేసీఆర్ పాలనలో అన్ని రంగాల్లో ముందుకు దూసుకువెళ్తున్నారని తెలిపారు.

మైనార్టీల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించటంతోనే ఇది సాధ్యమైందన్నారు. ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి సౌకర్యాలు ప్రతి ముస్లిం కుటుంబానికి అందేలా గౌరవ చూపడంతో అనతికాలంలోనే వారి జీవన పరిస్థితుల్లో పెనుమార్పులు జరిగాయన్నారు. దీనిని జీర్ణించుకోలేని కొంతమంది అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

హిందూ, ముస్లింల మధ్య గొడవలు సృష్టించేందుకు కొన్ని పార్టీల నాయకులు అలుపెరుగకుండా ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. వారి కుయుక్తులను ఎప్పటికప్పుడు పసిగడుతున్న సీఎం కేసీఆర్ వారి ఆటలను ముకుతాడు వేస్తున్నారని చెప్పారు. పదేళ్ల పాలనలో ఎక్కడ కూడా హిందూ, ముస్లింల మధ్య గొడవలు జరిగిన దాఖలాలు లేవని, 144వ సెక్షన్‌లు, ర్యాలీలు, రాస్తారోకోలు లేవన్నారు. ప్రశాంత వాతావరణంలో రాష్ట్రం ముందుకు సాగుతుందన్నారు.

రాజకీయ అవసరాలు వీడి తెలంగాణ పిల్లల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఈ సందర్భంగా 350 మంది ముస్లిం మహిళలకు స్వయం ఉపాధి పథకంలో భాగంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ డాక్టర్ బీ గోపి, మేయర్ వై సునీల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్‌ను తప్పించుకునేందుకు ఏకంగా ఆటోను ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కించేశాడు

న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ప్రముఖ నగరాల్లో ట్రాఫిక్ సమస్యల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సినవనిలేదు. ఒక్కసారి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయామంటే అంతే సంగతులు. గంటల తరబడి అక్కడే చిక్కుకుపోవాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనదారులైతే వాహనాల మధ్యలో దూరి ఈజీగా వెళ్లిపోతుంటారు. అయితే, ఆటో, కారు, బస్సులు మాత్రం ముందు వాహనాలు కదిలే వరకూ వేచి ఉండాల్సిందే. అయితే, దేశ రాజధాని ఢిల్లీ లో ఓ ఆటో డ్రైవర్) మాత్రం ట్రాఫిక్‌ను తప్పించుకునేందుకు తన మూడు చక్రాల వాహనాన్ని ఏకంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కించేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఈ ఘటనపై స్పందించిన పోలీసులు ఆటో డ్రైవర్‌ను 25 ఏళ్ల మున్నాగా గుర్తించారు. ఈ మేరకు అతడిని అరెస్ట్ చేసి ఆటోన సీజ్ చేశారు.

# ఎంపిక చేసిన 75 మంది ఉపాధ్యాయులకు జాతీయ ఉపాధ్యాయుల అవార్డు 2023ని ప్రదానం చేయనున్న భారత రాష్ట్రపతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:ఎంపిక చేసిన 75 మంది అవార్డ్ గ్రహీతలకు గౌరవ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము సెప్టెంబర్ 5న న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నేషనల్ టీచర్స్ అవార్డ్ 2023ని పురస్కారాలు ప్రదానం చేస్తారు. ప్రతి సంవత్సరం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి అయిన సెప్టెంబర్ 5వ తేదీని భారతదేశం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటుంది. జాతీయ ఉపాధ్యాయుల అవార్డు ఉద్దేశ్యం దేశంలోని ఉపాధ్యాయుల విశిష్ట సహకారాన్నిగుర్తించి, వారి నిబద్ధత, అంకితభావం ద్వారా విద్యా నాణ్యతను మెరుగుపరచడమే కాకుండా వారి విద్యార్థుల జీవితాలను సుసంపన్నం చేసిన ఉపాధ్యాయులను గౌరవించడం. ప్రతి అవార్డుకు మెరిట్ సర్టిఫికేట్, నగదు పురస్కారం రూ. 50,000, వెండి పతకం బహుకరిస్తారు. అవార్డు గ్రహీతలు గౌరవ ప్రధాన మంత్రితో సంభాషించే అవకాశాన్ని కూడా పొందుతారు.

పాఠశాల విద్య,అక్షరాస్యత విభాగం, విద్యా మంత్రిత్వ శాఖ కఠినమైన, పారదర్శక ఎంపిక ప్రక్రియ ద్వారా ఎంపిక చేయబడిన దేశంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులను అందించడానికి ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం నుండి, జాతీయ ఉపాధ్యాయుల అవార్డు పరిధి ఉన్నత విద్యా శాఖ, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత ఉపాధ్యాయులను కూడా చేరుస్తు పరిధిని విస్తరించారు. ఈ సంవత్సరం 50 మంది పాఠశాల ఉపాధ్యాయులు, ఉన్నత విద్య నుండి 13 మంది ఉపాధ్యాయులు, స్కిల్ డెవలప్‌మెంట్ ఉ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ నుండి 12 మంది ఉపాధ్యాయులు అవార్డులు పొందనున్నారు.

వినూత్న బోధన, పరిశోధన, కమ్యూనిటీ ఔట్రీచ్, పనిలో కొత్తదనాన్ని గుర్తించే ఉద్దేశ్యంతో భాగస్వామ్యాన్ని (జన్ భాగీదారి) పెంచడానికి ఆన్‌లైన్ మోడ్‌లో నామినేషన్లను కోరింది. ఉపాధ్యాయుల ఎంపిక కోసం విద్యా శాఖ మంత్రి ప్రముఖ వ్యక్తులతో కూడిన మూడు వేర్వేరు స్వతంత్ర జాతీయ జ్యూరీని ఏర్పాటు చేశారు.

# భారత నావికాదళం కేంద్రాలను సందర్శించిన యుఏఈ నేవీ ఎస్.ఎం.ఈ. ప్రతినిధి బృందం

## – విజయవంతంగా ముగిసిన సందర్శన.. ఫలప్రదమైన చర్చలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:భారత నావికాదళం కేంద్రాలను సందర్శించిన యుఏఈ నేవీ ఎస్.ఎం.ఈ ప్రతినిధి బృందం సందర్శించింది. కల్నల్ డాక్టర్ అలీ సైఫ్ అలీ మెహ్రాజీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల యుఏఈ నేవీ సబ్జెక్ట్ మేటర్ (ఎస్ఎంఈ) ప్రతినిధి బృందం 01 సెప్టెంబర్ 23న ప్రత్యేక వాతావరణ శాస్త్రం, సముద్ర శాస్త్రం, శిక్షణ మరియు వాతావరణ మోడలింగ్ కేంద్రంలో సందర్శించింది. ఈ బృందం నాలుగు రోజుల పర్యటన సందర్భంగా ఇండియన్ నేవీతో ప్రొఫెషనల్ ఇంటరాక్షన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. 01 సెప్టెంబర్ 23న న్యూ ఢిల్లీలోని రక్షణ శాఖ (నేవీ) ఇంటిగ్రేటెడ్ హెడ్‌క్వార్టర్స్ (ఐ.హెచ్.క్యు)లో జరిగిన ద్వైపాక్షిక సమావేశం జరిగింది. ఇది అధికారుల సందర్శనలో కీలకమైన ముఖ్యాంశం. ఈ సందర్భంగా చేపట్టిన కార్యక్రమాలు వాటి ఫలితాల పట్ల రెండు నౌకాదళాలు తమ సంతృప్తిని వ్యక్తం చేశాయి. వాతావరణ శాస్త్రం మరియు సముద్ర శాస్త్ర రంగాలలో సహకారాన్ని మరింతగా పెంచుకోవడానికి అంగీకరించాయి. రెండు నౌకాదళాల పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఫలవంతమైన చర్చలు జరిగేలా వ్యవస్థను సులభతరం చేసి, సాదర స్వాగతం పలికిన భారత నావికాదళానికి ఆతిథ్య ప్రతినిధి బృందం అధిపతి కల్నల్ డాక్టర్ అలీ సైఫ్ అలీ మెహ్రాజీ కృతజ్ఞతలు తెలిపారు. భారత నావికాదళం ద్వారా అభివృద్ధి చేయబడిన అత్యాధునిక సాంకేతికతలు, పద్ధతులు మరియు పరిశోధనా కార్యక్రమాలకు సాక్ష్యమివ్వడం, సహచరులతో నిమగ్నమవ్వడం ద్వారా పొందిన అంతర్దృష్టులకు యు.ఎ.ఈ.లకు నావికాదళం అత్యంత విలువైనది. ఈ కొత్త పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడానికి, ఉమ్మడి పరిశోధన మరియు సహకారం కోసం అవకాశాలను అన్వేషించడానికి ప్రతినిధి బృందం ఎదురుచూస్తోంది. న్యూఢిల్లీలోని ఐ.హెచ్.క్యూ ఎంఓడీ (నేవీ) పర్యటనలో భాగంగా, కల్నల్ డాక్టర్ అలీ సైఫ్ అలీ మెహ్రాజీ రియర్ అడ్మిరల్ నిర్భయ్ బాప్నా, ఏసీఎన్ఎస్ (ఎఫ్సిఐ)ని కూడా కలిశారు. వాతావరణ నమూనాలు, సముద్ర పరిస్థితులు మరియు వాతావరణ మార్పుల తోపాటు నౌకాదళ కార్యకలాపాలపై ప్రభావం చూపే ఇతర సంబంధిత రంగాల వంటి సవాళ్లను ఎదుర్కోవడంలో అంతర్జాతీయ సహకారం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పేలా చర్చలు జరిగాయి. అందరికీ ఉజ్వలమైన మరియు సుస్థిరమైన భవిష్యత్తును సృష్టించేందుకు రెండు దేశాల నిబద్ధత మరియు అంకితభావానికి ఈ సందర్శన నిదర్శనం.

# మరోసారి సమైక్యవాదుల కుట్రలు.. తెలంగాణ ప్రజలు అప్రమత్తం కావాలి

నల్గొండ, సెప్టెంబర్ 4:తతెలంగాణను దోచిన వాళ్లే మళ్లీ ఇక్కడ పాగా వేయాలని కుట్రలు చేస్తున్నారు. దురాలోచనతో వస్తున్నారు. తస్మాత్ జాగ్రత్త. నిన్న కాంగ్రెస్ వాళ్లు చేసిన రైతే రాజు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో కేవీపీ లాంటి వ్యక్తి నే తెలంగాణ వాడిని అనడంలో ఓ పెద్ద కుట్ర దాగి ఉందని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. నల్గొండలోనీ తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణను రాకుండా అడ్డుపడి కుట్ర పన్నింది కేవీపీనే. ఇక షర్మిలది పెద్ద జోక్. తెలంగాణలో రాజన్న రాజ్యం తెస్తా అంటున్నది.

కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో రాజన్న పాలన కంటే వంద రేట్లు ఎక్కువగా తెలంగాణ ప్రజలు, అన్నదాతలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇది గమనించాలి. షర్మిల కూడా అవినీతి గురించి మాట్లాడుతుంటే నవ్వు వస్తున్నది. ఆంధ్రలో రాజకీయాలు ఆమెకు చేతకాదు. తెలంగాణను దోచుకోవడం కోసమే షర్మిల కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. ఆమె మాటల్లో అర్ధం పర్థం ఉండదు.

తెలంగాణపై ఆధిపత్యం కోసమే వీరి అందరి ప్రయత్నం. కేవీపీ, షర్మిల, రేణుక చౌదరి లాంటి వాళ్లు తెలంగాణ పై దండయాత్ర మొదలు పెట్టారు. దోచుకోవాలని కుట్ర చేస్తున్నారు. సమైక్య వాదుల కబంద హస్తాల్లోకి తెలంగాణ మళ్లీ పోనీయొద్దన్నారు. తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబు కూడా హైదరాబాద్‌లో ఉంటూ ఆంధ్ర లో రాజకీయాలు చేస్తున్నాడు. హైదరాబాద్‌లో ఉంటూ తెలంగాణ పై కుట్రలు చేస్తాం అంటే మాత్రం కుదరదని హెచ్చరించారు. జమిలి ఎన్నికలు అసలు సాధ్యం కాదు. బీజేపీ ప్రయోజనాల కోసమే జమిలి ఎన్నికలు తెస్తున్నారని మండిపడ్డారు. అది నుంచి మోదీ తెలంగాణపై అక్కసు ఉన్నది. దక్షిణాది రాష్ట్రాలంటే కూడా మోదీకి నచ్చదన్నారు.

# బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ - ఐదో తేదీ నుంచి అనంత, కర్నూల్ జిల్లాలలో చంద్ర బాబు పర్యటన

అమరావతి, సెప్టెంబర్ 4: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు "బాబు ష్యూరిటీ– భవిష్యత్ గ్యారెంటీ" కార్యక్రమంలో భాగంగా 5వ తేదీ నుంచి జిల్లాల పర్యటనలకు వెళుతున్నారు. 5వ తేదీ అనంతపురం జిల్లా రాయదుర్గం నుంచి పర్యటన ప్రారంభం అవుతుంది. 5,6,7 తేదీల్లో అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుంతకల్ నియోజకవర్గాల్లో వివిధ వర్గాల ప్రజలతో చర్చా కార్యక్రమాలు, సమావేశాలు, రోడ్ షోలు, సభల్లో పాల్గొంటారు.

8, 9 తేదీల్లో కర్నూలు జిల్లాలో చంద్రబాబు నాయుడు పర్యటన ఉంటుంది. ముందుగా హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 1 గంటకు బళ్లారి చేరుకోనున్న చంద్రబాబు ?అక్కడ తెలుగు ప్రజలు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం రాయదుర్గం నియోజకవర్గంలో పర్యటనలో పాల్గొంటారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 45 రోజుల పాటు పార్టీ కార్యకర్తలు, నేతలు ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి మొదలైన ఈ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల్లో కార్యకర్తలు, నేతలు పాల్గొంటున్నారు.

## పారాచూట్ నాయకులకు టికెట్ ఇవ్వొద్దంటూ...

# మధుయాష్కికి వ్యతిరేకంగా గాంధీభవన్‌లో వెలసిన పోస్టర్లు

హైదరాబాద్ సెప్టెంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): నిజామాబాద్ మాజీ ఎంపీ, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీకి వ్యతిరేకంగా గాంధీభవన్‌లో వెలసిన పోస్టర్లు కలకలం సృష్టిస్తున్నాయి. పారాచూట్ నాయకులకు టికెట్ ఇవ్వొద్దంటూ పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు పోస్టర్లు అంటించారు. సేవ్ ఎల్బీనగర్ కాంగ్రెస్ మధుయాష్కి గో బ్యాక్ టు నిజామాబాద్ అంటూ పోస్టర్లు వెలిశాయి. 2009 ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా విజయం సాధించిన మధుయాష్కి.. తెలంగాణ ఆవిర్భావం తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ ఓటమి చవిచూశారు. దీంతో ఆయన ఈసారి పార్లమెంటు ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లా నుంచి కాకుండా.. హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే అక్కడ స్థానిక నేతలైన మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోదరుడు, మరో నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డి సైతం అభ్యర్థిత్వం కోసం అప్లయ్ చేసుకున్నారు. దీంతో పోటీ త్రిముఖంగా మారింది. ఈ నేపథ్యంలో కష్టకాలంలో కూడా నియోజకవర్గంలో పార్టీని కాపాడుకుంటూ వస్తున్న తమకు కాకుండా మరొకరికి టికెట్ ఇస్తారేమోనని అక్కడి నాయకులు ఆందోళనకు గురవుతున్నారు.

ఈ క్రమంలో యాష్కికి వ్యతిరేకంగా గాంధీ భవన్‌లో పోస్టర్లు వెలవడం గమనార్హం.

# ముంబైలోని యశ్వంతరావ్ చవాన్ సెంటర్‌లో ఒక రోజు "కేసీసీ ఫర్ ఫిషరీస్"

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమల మంత్రి శ్రీ పర్షోత్తమ్ రూపాలా 4 సెప్టెంబర్ 2023న మహారాష్ట్రలోని ముంబైలోని యశ్వంతరావు చవాన్ సెంటర్‌లో ఒక రోజు "కేసీసీ ఫర్ ఫిషరీస్‌పై జాతీయ సదస్సు"కు అధ్యక్షత వహిస్తారు. భూగర్భ సమస్యలను పరిష్కరించేందుకు మత్స్యశాఖ మరియు పశుసంవర్ధక డెయిరీ శాఖ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో సహాయ మంత్రి, డాక్టర్ ఎల్. మురుగన్, రాష్ట్ర మంత్రి, ఆర్థిక మంత్రిత్వ శాఖ, డా. భగవత్ కిషన్‌రావు కరాద్, మత్స్యశాఖ మంత్రి, ప్రభుత్వం మహారాష్ట్ర, శ్రీ సుధీర్ ముంగంటివార్, రెవెన్యూ, పశు సంవర్ధక మరియు పాడిపరిశ్రమ అభివృద్ధి మంత్రి, ప్రభుత్వం మహారాష్ట్ర –శ్రీ రాధాకృష్ణ ఏకనాథ రావు విఖేపాటిల్, సెక్రటరీ, డీ ఏ హెచ్ డి అల్కా ఉపాధ్యాయ, కార్యదర్శి, డి ఓఎఫ్– డాక్టర్ అభిలాక్ష్ లిఖి, జాయింట్ సెక్రటరీ (ఇన్లాండ్ ఫిషరీస్), అదనపు సెక్రటరీ, డీ ఏ హెచ్ డి వర్ష జోషి, జాయింట్ సెక్రటరీ (లోతట్టు మత్స్య), డి ఓఎఫ్– శ్రీ సాగర్ మెహ్రా మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్, ఎన్ ఎఫ్ డి బి డా. ఎల్. నరసింహ మూర్తి, ఏ ఆర్ ఎస్ తో పాటు ఆర్థిక మరియు బ్యాంకింగ్ సంస్థలైన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ మరియు నాబార్డ్ నుండి ముఖ్య ప్రతినిధులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

రాష్ట్రాలు/ యూ టీ లు, ఎన్ ఎఫ్ డి బి మరియు ఇతర సంబంధిత శాఖలు/మంత్రిత్వ శాఖల నుండి మత్స్య శాఖ ప్రతినిధులు, కేసీసీ లబ్ధిదారులు, మత్స్యకారులు, చేపల పెంపకందారులు, పారిశ్రామికవేత్తలు మరియు దేశవ్యాప్తంగా ఉన్న ఇతర లబ్ధిదారులు పాల్గొంటారని భావిస్తున్నారు. దాదాపు 500 మంది పాల్గొనే ఈ కార్యక్రమం హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించబడుతోంది.

ఈ కార్యక్రమంలో, ఎఫ్ ఏ హెచ్ డ డి మంత్రి అర్హులైన మత్స్యకారులు మరియు మత్స్యరైతులకు కేసీసీ కార్డులను పంపిణీ చేస్తారు. ఆయన వారితో సంభాషిస్తారు. సమావేశంలో చర్చకు అనుగుణంగా మరియు సంక్షేమం మరియు విధాన దృక్పథాలకు అనుగుణంగా సభను ఉద్దేశించి భవిష్యత్ దిశా నిర్దేశం చేస్తారు. ప్రత్యేక ఉపన్యాసాన్ని ఆర్ బీ ఐ, డి ఎఫ్ ఎస్, మరియు నాబార్డ్ ప్రతినిధులు పంచుకుంటారు. కార్యక్రమం సందర్భంగా, స్థానిక భాషలో కే సి సి పై మార్గదర్శకాలు/ ఎస్ ఓ పీ లు పంపిణీ చేయబడతాయి. లబ్దిదారుల మధ్య పరస్పర చర్య సమస్యలను పరిష్కరించడానికి మార్గం సుగమం చేస్తుంది. అందుబాటులో ఉన్న రుణ వితరణకు అడ్డంకులను తొలగిస్తూ తనిఖీలతో వున్న ఈ సరళీకృత ప్రక్రియ, దీర్ఘకాలిక మరియు ఆచరణాత్మక పరిష్కారాలను ఇస్తుందని భావిస్తున్నారు.

ఫిషరీస్ మరియు ఆక్వాకల్చర్ కార్యకలాపాలు ఆహారం, పోషకాహారం మరియు ఉపాధి కల్పనకు ముఖ్యమైన వనరు మరియు 2.8 కోట్ల మంది మత్స్యకారులు మరియు మత్స్యకారులకు జీవనోపాధికి ముఖ్యమైన వనరు. గత దశాబ్దంలో ఈ రంగం రాజ్యాంగ పద్ధతిలో వృద్ధిని ప్రదర్శించింది మరియు చిన్న తరహా మత్స్యకారుల వాటాదారులకు సంస్థాగత ఫైనాన్స్ లభ్యత అనేది దృష్టిని ఆకర్షించిన ముఖ్య అంశాలలో ఒకటి.

భారత ప్రభుత్వ కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం 2018–19 లో మత్స్య మరియు పశుసంవర్ధక రైతులకు వారి వర్కింగ్ క్యాపిటల్ అవసరాలను తీర్చడంలో వారికి సహాయం చేసింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ 4 ఫిబ్రవరి 2019న మత్స్యకారులు మరియు చేపల పెంపకందారులకు కేసీసీపై మార్గదర్శకాలను జారీ చేసింది. తదనంతరం, పశుసంవర్ధక మరియు మత్స్య రైతులకు కేసీసీ ద్వారా క్రెడిట్ డెలివరీ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి ఏ హెచ్ డి ఎఫ్ మంత్రిత్వ శాఖ, ఆర్ బీ ఐ, నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ మరియు ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ సహా వాటాదారులతో సంప్రదింపులు జరిపిన అనంతరం ప్రామాణిక నిర్వహణ విధానం /మార్గదర్శకాలు జారీ చేయబడ్డాయి

లబ్ధిదారులను సమీకరించడానికి మరియు కేసీసీ లను పెంచడానికి, మత్స్యకారులు మరియు చేపల పెంపకందారుల మధ్య సమాచారాన్ని సున్నితం చేయడానికి మరియు వ్యాప్తి చేయడానికి మత్స్య శాఖ అన్ని రాష్ట్రాలు/ యూ టీ లు మరియు రాష్ట్ర స్థాయి బ్యాంకర్స్ కమిటీ ని అనుసరిస్తోంది. వివిధ సవాళ్లు ఉన్నప్పటికీ, అన్ని రాష్ట్రాలు/యూ టీ లు మరియు ఎస్ ఎల్ బీ సీ వివిధ రకాల ప్రచారాలు మరియు ప్రమోషనల్ కార్యకలాపాల ద్వారా సంభావ్య లబ్ధిదారులలో కేసీసీ సౌకర్యం యొక్క ఉపయోగం గురించి అవగాహన పెంపొందించడానికి కృషి చేస్తోంది. ఈ నిరంతర ప్రయత్నాల ద్వారా, దేశవ్యాప్తంగా మత్స్యకారులు మరియు మత్స్యరైతులకు ఇప్పటి వరకు 1.49 లక్షల కేసీసీ జారీ చేసారు.

కేసీసీ దరఖాస్తుల సమీకరణ కోసం ప్రత్యేక డ్రైవ్ 1 జూన్ 2020 నుండి 31 డిసెంబర్ 2020 వరకు డి ఓ ఎఫ్ నిర్వహించింది. ఎఫ్ ఏ హెచ్ డ డి మంత్రి నేతృత్వంలో 15 నవంబర్ 2021 నుండి 31 జూలై 2022 వరకు దేశవ్యాప్తంగా ప్రచారం ప్రారంభించబడింది. " ఏ హెచ్ డి ఎఫ్ కేసీసీ దేశవ్యాప్త ప్రచారం" 15 సెప్టెంబర్ 2022 15 మార్చి 2023 వరకు పునఃప్రారంభించబడింది. ఇప్పుడు 1 మే 2023 నుండి 31 మార్చి 2024 వరకు కొనసాగుతోంది. తీరప్రాంత జిల్లాల్లో సాగర్ పరిక్రమ కార్యక్రమం సందర్భంగా ప్రత్యేక కేసీసీ ప్రచారాలు కూడా నిర్వహించబడ్డాయి. ఈ ప్రచారాల ద్వారా, ఆర్థిక మరియు బ్యాంకింగ్ సంస్థల ద్వారా కేసీసీ సౌకర్యాన్ని విస్తరించడంలో ఉన్న అడ్డంకులు మరియు సవాళ్లను అర్థం చేసుకోవడానికి డి ఓ ఎఫ్ ప్రయత్నిస్తుంది, అదే సమయంలో లబ్ధిదారుల సమస్యలు మరియు అడ్డంకుల గురించి లబ్ధిదారుల దృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది.

కిసాన్ క్రెడిట్ కార్డ్ ఆర్థిక చేరిక మరియు సహకారం కోసం ఒక శక్తివంతమైన సాధనం, ఇక్కడ వ్యవసాయం, మత్స్య సంపద, పశు పోషణ మరియు పాడి పరిశ్రమ వంటి కార్యకలాపాలు పెద్ద సంఖ్యలో పేద మరియు సన్నకారు రైతులు మరియు మత్స్యకారుల జీవనోపాధి మరియు ఆదాయ వృద్ధికి కీలక అంశాలుగా పరిగణించబడతాయి. ఇది రైతులకు మద్దతునివ్వడానికి మరియు సమ వృద్ధిని ప్రోత్సహించడానికి కేంద్రం మరియు రాష్ట్ర సంస్థల చిత్తశుద్ధిని సూచిస్తుంది.

# పెద్దవాగులో చిక్కుకున్న గ్రామస్తుడు -సహాయ కార్యక్రమాలలో కలెక్టర్, ఎమ్మెల్యే



నిజామాబాద్, సెప్టెంబర్ 4: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం గాంధారి మండలంలోని మాతు సంఘం గ్రామ సమీపంలోనీ గాంధారి పెద్దవాగు ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి సోమవారం ఉధృతంగా ప్రవహిస్తున్నది వాగు ఉధృతిలో చిక్కుకున్న గౌరీ సంగయ్య అనే వ్యక్తినీ కాపాడడం కోసం అధికారులు సహాయక చర్యల కోసం వాగు వద్దకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్ వాగులో చిక్కుకున్న గౌరి సంగయ్య తో ఫోన్లో మాట్లాడి అతనికి ధైర్యంచెప్పారు .వారి వెంట కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసులు దగ్గర ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నాను.

# మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలనే ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ:మంత్రి పువ్వాడ అజయ్



ఖమ్మం, సెప్టెంబర్ 4:(నేటి నిజం ప్రతినిధి): మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలనే ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ చేపట్టిందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. సోమవారం ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలం కోటపాడు గ్రామంలోని మాచినేని చెరువులో ప్రభుత్వం పంపిణీ చేసిన 75 వేల చేప పిల్లలను (రోహు, మ్రిగాల, కట్ల రకాల చేప పిల్లలు) మంత్రి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తో కలిసి చెరువులో వదిలారు. ముందుగా గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మత్యకారుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేశారని, నాడు చేపలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి నేడు ఎగుమతి చేసుకునే స్థాయికి వెళ్లామన్నారు. రైతు బంధు, రైతు భీమా, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. మధ్యవర్తుల వ్యవస్థను రూపుమాపడం కోసం ప్రభుత్వం రాయితీపై చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి మరోసారి గుర్తు చేశారు. ఇతర రాష్ట్రాల్లో చేపలను విక్రయించడానికి వాహనాలను రాయితీపై ఇచ్చిందని తెలిపారు. నీలి విప్లవంను ప్రోత్సహించేందుకు మత్స్యసంపదను సృష్టిస్తున్న రని అన్నారు. సబ్బండ వర్గాల కులవృత్తులను ప్రోత్సహిస్తూ వారికి అండగా ప్రభుత్వం నిలుస్తుందన్నారు. ఖమ్మం జిల్లాలో సహజ నీటి వనరులపై ఆధారపడి నేటివరకూ జిల్లాలో 186 సహకార సంఘాల నమోదు అయాయ్యయన్నారు. ప్రాథమిక సంఘాల 143,మహిళ సంఘాలు 30,హరిజన సంఘాలు 6,గిరిజన సంఘాలలో 14031మంది మత్స్య కారులకు సభ్యత్వం కల్పించామన్నారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, 2023-24 సంవత్సరానికి గాను 100శాతం రాయితీపై జిల్లాలోని903చెరువుల్లో 362.59లక్షల చేప పిల్లలు వదులుటకు లక్ష్యం నిర్ణయించామన్నారు. ఖమ్మం నియోజకవర్గంలోని 54 నీటి వనరుల్లో 3.35 లక్షల చేప పిల్లలు వదలనున్నట్లు ఆయన తెలిపారు. నిబంధనల మేరకు చేప పిల్ల సైజు, రకం, సంఖ్య ఉండేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వం 100శాతం రాయితీపై ఖమ్మం జిల్లాలో 551 చెరువులలో 2.02కోట్ల చేప పిల్లలను ఆయా చెరువుల్లో వదిలేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, మత్స్యశాఖ ఏడి ఆంజనేయ స్వామి, పీఆర్ ఇఇ కెవికె. శ్రీనివాస్, రఘునాథ పాలెం ఎంపిడివో రామకృష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు, మత్స్య సహకార సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు వాయిదా

అమరావతి, సెప్టెంబర్ 4:భారీ వర్షం కారణంగా రాయలసీమ జోన్ పరిధిలోనీ కర్నూల్ ఏపిఎస్ పి 2 వ బెటాలియన్ లో సోమవారనీ (సెప్టెంబర్ 4 వ తేది) జరగాల్సిన ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు వాయిదా వేసినట్లు కర్నూల్ రేంజ్ డిఐజి సెంథిల్ కుమార్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ జోన్ పరిధిలో(. ఎస్సై అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు జరగాల్సి ఉంది. కర్నూల్ పట్టణంలో భారీ వర్షం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కర్నూల్ రేంజ్ డిఐజి సెంథిల్ కుమార్ వెల్లడించారు.

. వాయిదా పడ్డ దేహదారుఢ్య పరీక్షల్ని ఈనెల 21వ తేది. నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 4వ తేదీ దేహదారుఢ్య పరీక్షలకు రావలసిన ఎస్ఐ అభ్యర్థులు సెప్టెంబర్ 21 తేదీ న రావాల్సిం దిగా డిఐజి సెంథిల్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# వృత్తిలో తరించిన యశస్వి - మన సర్వేపల్లి

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబరు, 5, 1888 న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీ.ల దూరమున ఉన్న తిరుత్తణిలో తమిళనాడుకు వలసవెళ్ళిన తెలుగు దంపతులైన సర్వేపల్లి వీరాస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించారు. వీరాస్వామి ఒక జమీందారిలో, తాహసీల్దార్గా వృత్తిని కొనసాగించారు. వారి మాతృభాష తెలుగు, రాధాకృష్ణన్ బాల్యం నుండి అసాధానమైన తెలివితేటలు కలిగి ఉండేవారు. జీవన సోపాన పథంలో ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించి, అత్యున్నతమైన రాష్ట్రపతి పీఠం అధిరోహించిన మహామనిషి. కనుకనే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మించిన సెప్టెంబరు 5వ తేదీని ఉపాధ్యాయలోకానికి కలిగిన గుర్తింపుగా దేశమంతా జాతీయ ఉపాధ్యాయదినోత్సవ సంబరాలు జరుపుకోవడం జరుగుతుంది.

## బాల్యం, విద్యాభ్యాసం:

రాధాకృష్ణన్ ప్రాథమికవిద్య, తిరుత్తణిలోని కె.వి. హైస్కూలులోనూ, హైస్కూలు చదువు, తిరుపతిలోని లూథరన్ మిషన్ స్కూలు, వాలాజాపేటలో ప్రభుత్వ హైయ్యర్ సెకండరీ విద్యని పూర్తి చేసారు. బాల్యదశలో చాలా ఏళ్ళు తిరుత్తణి, తిరుపతి పుణ్యక్షేత్రాలలోనే గడిపారు. ఆయన 1 విద్యాభ్యాసమంతా క్రైస్తవుల ఆధ్వర్యంలోనే జరగడం విశేషం. బైబిల్లోని ముఖ్యంగా న్యూడిస్టెంట్ బోధనలలో తనకు పరిచయమేర్పడడం ఆనందం కలిగించినా, హిందూమతంపై ద్వేషభావం కనపరచడం ఆయనకు విచారం కలుగజేసేది. ఒకవైపు సర్వమతసమానభావాన్ని అలవరుచుకుంటూనే ఆయన ఇంకొకవైపు సిసలైన హిందువుగా వివేకానందుని ప్రబోధనలకు ఉత్తేజితులవుతూ వచ్చారు. ఈ వాతావరణంలోనే 17 సంవత్సరాల యువకుడైన రాధాకృష్ణన్ మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో చేరడం, 1906 లో అక్కడ నుండి పట్టభద్రులు కావడం అదే కళాశాలలో, ఎం.ఏ. డిగ్రీ కోసం తన అభిమాన ప్రత్యేక విషయంగా వేదాంతాన్ని తీసుకున్నారు. ఎం.ఏ. డిగ్రీ పరీక్షకు, వేదాంత నీతి గురించి విమర్శనాత్మక వ్యాసం వ్రాశారు. దాన్ని అప్పటి ప్రొఫెసర్ అయిన ఎ.జి. హాగ్ ఎంతో మెచ్చుకుని అచ్చు వేయించారు. అప్పటికి రాధాకృష్ణన్ వయస్సు 20 సంవత్సరాలు.

## వివాహం:

వీరికి 18 సంవత్సరాల చిరుప్రాయంలో శివకామమ్మతో వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కూతుళ్ళు, ఒక కుమారుడు కలిగారు.

## బోధనా చతురత:

రాధాకృష్ణన్ మద్రాసు క్రిస్టియన్ కాలేజి నుంచి, ప్రెసిడెన్సీ వేదాంత శాఖలో 1909 లో అసిస్టెంటు లెక్చరర్ చేరారు. ప్రిన్సిపాల్ ఆదేశంపై చదువుకుంటున్న కాలంలోనే తరగతిలోని, తనతోటి విద్యార్థులకు మనస్తత్వ శాస్త్రంలో బోధించే అపురూపమైన అవకాశం ఆయనకు లభించింది. హిందూమత సిద్ధాంతాలను వివరిస్తూ ప్రముఖ పత్రికల్లో అనేక వ్యాసాలు వ్రాయడంతో, ఆయన కీర్తి దశదిశలా వ్యాపించింది. 1918 లో మైసూరు మహరాజ్ ఆహ్వానంపై, అక్కడ కొత్తగా ఏర్పడిన విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ ఆఫ్ ఫిలాసఫీగా చేరారు. మైసూరు సంస్థానంలో ఉన్న మూడేళ్ళ కాలంలో ప్రొఫెసర్ రాధాకృష్ణన్ వేదాంత రచయితగా తన ఖ్యాతిని సుస్థిరం చేసుకున్నారు. రాధాకృష్ణన్ వ్రాసిన రెండు పుస్తకాలు 'ఫిలాసఫీ ఆఫ్ రవీంద్రనాథ్ ఠాగూర్', రోల్ ఆఫ్ రెలిజియన్ ఇన్ కంటెపారరీ ఫిలాసఫీ' ద్వారా ఆయన పేరు అమెరికన్ ఫిలసోఫికల్ అసోసియేషను, అధ్యక్షోపన్యాసమిస్తూ, 'ఇద్దరు ఆదర్శవాదుల ప్రతినిధుల గురించి ప్రస్తావించారు. అందులో రాధాకృష్ణన్ ఒకరు. ఆ తరువాత 1921 లో సుప్రసిద్ధ అశుతోష్ ముఖర్జీ (వైస్ ఛాన్సలర్ – కలకత్తా విశ్వవిద్యాలయం) దేశంలోని అతి ముఖ్య వేదాంత పీఠాన్ని అలంకరించవలసినదిగా ప్రొఫెసర్ రాధాకృష్ణను ఆహ్వానించారు. కలకత్తా విశ్వవిద్యాలయంలో, మానసిక నైతిక శాస్త్రంలో 'ఐదు జార్జి చక్రవర్తి పీఠాన్ని స్వీకరించడం కంటే గొప్ప గౌరవమేమున్నదని, ఆయన ఆ ఆహ్వానాన్ని ఆమోదించారు. కలకత్తాలో మొత్తంగా 20 సంవత్సరాలు ఉన్న కాలంలో, అనేక విదేశ ఆహ్వానాలు స్వీకరించి పటుచోట్ల ఉపన్యాసాలు చేశారు. 1926 లో, ఆక్స్ ఫర్డ్ ఆస్టిన్ స్మారక ప్రసంగాలిచ్చారు. అదే సంవత్సరం ఆగష్టులో, చికాగో విశ్వవిద్యాలయంలో హాస్కెల్ స్మారక ప్రసంగాలు చేశారు. 1927 లో డాక్టర్ రాధాకృష్ణన్ భారతీయ తత్వశాస్త్రం రెండొవ సంపుటిని, 1928 లో 'మనకు అవసరమైన మతం', 1929 లో 'నాగరికత భవిష్యత్తు', 1930 లో 'ఐడియాలిస్టిక్ వ్యూ ఆఫ్ లైఫ్', 1938 లో 'ఈస్ట్ అండ్ వెస్ట్ ఇన్ విజియన్' అనే గ్రంథాలను ఆవిష్కరించారు.



## భాషా పాండిత్యం:

పాశ్చాత్యులను సైతం అబ్బురపరిచే ఇంగ్లీషు భాషా పాండిత్యం గలిగిన రాధాకృష్ణన్, వీరి భాషా పాండిత్యం గురించి పెక్కు ఉదాహరణలు పేర్కొనవచ్చు. ఒకసారి డాక్టర్ రాధాకృష్ణన్ యునెస్కో సమా వేశంలో పాల్గొనడం తో, ఆ సభలో ప్రసగించవలసిన ఫ్రెంచ్ పండితుడు, డాక్టర్ రాధాకృష్ణన్ ప్రవాహతుల్యమైన ఉపన్యాసం విన్న తర్వా త, ఇక తను ఇంగ్లీషులో ప్రసంగించే ధైర్యం చాలక వారి మాతృభాషలోనే ఉపన్యసించారు. రాధాకృష్ణన్ 1931 నుండి 1936 వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్గా, ఉపన్యసించిన తన మొదటి ప్రసంగం తెలుగులో మాట్లాడుతూ, మేము ఆంధ్రులం, భారత దేశంలో సమర్ధవంతమైన ఐక్యతా భావాన్ని పెంపొందించగల సామర్థ్యం ఉందంటే అది ఆంధ్రాలోనే ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను. మా మహిళలు ఎక్కువ స్వేచ్ఛను కలిగి ఉన్నారు. మాతృభాష ప్రేమ మనందరినీ బందిస్తుంది, అని మాట్లాడటంలో గల ఉద్దేశ్యం ఆంధ్రాభిమానం, ఆయనకున్న ప్రాంతీయ అవధులను దాటి విశ్వవిద్యాలయాభివృద్ధికి, విస్తృత విశాల స్థాయిలో కృషి చేశారు.

## మహాత్మాగాంధీ పై అభిమానం:

మహాత్ముని 70వ జన్మదినోత్సవం సందర్భంగా, 1939 లో ప్రపంచంలోని ప్రముఖులైనవారు రాసిన వ్యాసాలను సంకలనపరిచి, రాధాకృష్ణన్ ఆ గ్రంథానికి, ఉపోద్ఘాతం రాసి ప్రచురించి మహాత్మునికి జన్మదిన కానుకగా సమర్పించారు. ఆ సంవత్సరమే కాశీ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్గా నియమితులై, కాశీలో భారత సంస్కృతులకు సంబంధించి బోధన సాగించారు.

## రాధాకృష్ణన్ ఖ్యాతి:

విశ్వవ్యాప్తమైన అనేక విద్యాసంస్థలు డాక్టర్ రాధాకృష్ణన్ ఉపన్యాసాలను పొందుపరచి విజ్ఞాన సంపన్నమైనాయి. 1946 లో అమెరికాలో వాట్మెన్ ఉపన్యాసమిచ్చారు. ప్రపంచ వైజ్ఞానిక సంస్థలో భారత ప్రతినిధి వర్గానికి, 1946 నుంచి 1950 వరకు నాయకత్వం వహించారు. 1948 లో ఆ సంస్థ ఉపాధ్యక్షులుగాను, 1949 లో దాని అధ్యక్షులుగాను ఆయన ఎన్నికయ్యారు. 1948 లో కాశీ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ పదవిని వదిలిపెట్టి, విశ్వవిద్యాలయ విద్యావ్యవహారాల కమీషన్ అధ్యక్ష పదవి బాధ్యతలను స్వీకరించారు. భారత దౌత్యరంగంలో డాక్టర్ రాధాకృష్ణన్ ఒక నూతన శకం సృష్టించారంటే అది అతిశయోక్తికాదు. 1949 లో మాస్కోలో భారత రాయబారిగా నియమితులై ఆయన ఆ పదవిలో 1952 వరకున్నారు. ఈ విధంగా అనేకమైన అత్యున్నత గౌరవ పదవులను ప్రతిభావంతంగా నిర్వహించి, పశ్చిమ దేశాలతో సంబంధ బాంధవ్యాల వారధిని ఏర్పాటు చేసిన మొదటి వ్యక్తిగా ఖ్యాతిని పొందారు సర్వేపల్లి.

## అవార్డులు:

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్కు అనేకానేక ఉన్నత అవార్డులు లభించాయి. వాటిలో ముఖ్యమైనవి. 1954 భారతరత్న అత్యున్నత పౌర పురస్కారం, 1989 – భారత దేశంలో వీరి పేరిట స్టాంపును విడుదల చేసారు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయల్లైన ఆక్స్ ఫర్డ్, కేంబ్రిడ్జ్ మొదలైన వాటినుండి 100కు పైగా గౌరవపురస్కారాలు, డాక్టరేట్ సంపాదించారు.

## ఉపాధ్యాయ దినోత్సవ సందర్భం:

రాధాకృష్ణన్ ఉపాధ్యాయవృత్తిలో ఉన్నప్పుడు, విద్యార్థులకు పాఠాలు శ్రద్ధగా బోధించడమే కాకుండా, వారిపై అపార ప్రేమాభిమానాలు చూపేవారని, వారు మైసూరు నుంచి కలకత్తాకు ప్రొఫెసర్గా బదిలీపై వెళ్ళేటప్పుడు విద్యార్థులు గుర్రపు బండిని పూలతో అలంకరించి తమ గురువును గుర్రపు బండిలో కూర్చొబెట్టి, రైల్వేస్టేషన్ వరకు విద్యార్థులే మోసుకొని తీసుకువెళ్ళడము గురువు అయిన రాధాకృష్ణన్గారిపై ఉన్న అభిమానం అవధులు దాటిన గురుశిష్యుల అనుబంధముగా చూడవచ్చు. రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు వారి శిష్యులు అభిమానులు పుట్టినరోజును ఘనంగా చేస్తాము అని కోరగా దానికి బదులు ఆ రోజును ఉపాధ్యాయదినోత్సవంగా చేయాలని కోరారట. 1962 భారత ప్రభుత్వం వీరి పుట్టిన రోజు సెప్టెంబర్, 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించి, ప్రతియేట ఉపాధ్యాయవృత్తిలోని ఉన్నత విలువలకు, గురుశిష్యుల సంబంధానికి నిదర్శనంగా, ఉపాధ్యాయులకు సెప్టెంబర్, 5న అంకితంచేస్తూ జరుపుకుంటున్న ఉత్సవం. ఆనాటి నుండి వారి పుట్టిన రోజును ఉపాధ్యాయదినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితిగా మారింది. ఆ తేదిని ఉపాధ్యాయులకు అంకితంచేసస్తూ జరుపుకుంటున్న ఉత్సవం.

## ముగింపుగా:

డాక్టర్ రాధాకృష్ణన్ భారత దేశానికి మొట్టమొదటి ఉపరాష్ట్రపతిగా పదేళ్ళు, రాష్ట్రపతిగా ఐదేళ్ళు ఎంతో హుందాగా పనిచేసి, ఆ పదవులకే గౌరవం చేకూర్చిపెట్టారు. భారతదేశము అత్యంత క్లిష్టకాలములో (చైనా – పాకిస్తాన్తో యుద్ధసమయం) ఆనాటి ప్రధానులకు మార్గనిర్దేశం చేసారు. ఆయన హిందుమత ప్రాముఖ్యాన్ని ప్రపంచానికి తెలియచెప్పిన భారతరత్న. అనారోగ్య కారణంగా ఢిల్లీ రిపబ్లిక్ పెరెడ్కు హాజరుకాలేకపోయిన రాష్ట్రపతి వీరు ఒక్కరే. రాధాకృష్ణన్ 1975 ఏప్రిల్, 17వ తేదిన తుది శ్వాస విడవడం భారత దేశానికి తీరని లోటని చెప్పవచ్చు. ది గ్రేట్ లెజెండ్ మన తెలుగువాడు సర్వేపల్లి.



-శారద శృంగేరి
9490 26 1119

## గురువు కల్పతరువు

సమస్త విద్యనందించే గురువు..
జ్ఞానశక్తి ప్రదాత
గురుబ్రహ్మగా గురువిష్ణుగా
గురుమహేశ్వరులేకమైన పరబ్రహ్మమే ఆచార్యుడు
ఆత్మలోగిలిలో కొలువైనకోర్కెలు
తీర్చె తిమిర సంహారుడు..!.
సృష్టి స్థితి లయల మూర్తిమత్వాలకు మూలవిరాటు
నాలుగ్గోడలతరగతి గదిలో
దశదిక్కుల శతాంశాల అనంత విశ్వపు
గమక చమక మార్పుల్ని
చిరుగుండెల్లో నిక్షిప్తం చేసే
మేధో వికాసానికి నాంది..!.
గూగుల్ కన్న మిన్న
ప్రభాకాంతుల కర్తవ్య పిపాసి
బడి గుండెల సవ్వడి
బాధ్యత భవిష్యత్తుల కాలజ్ఞాని
త్రికాల మానవచరిత్రలో గురువే దిక్సూచి
సమాజ నిర్మాణంలో
సమన్వయవిలువల సంస్కారి!.
గురువునారాధించు
గురువు బోధనే జ్ఞానకిరణం
ధ్యాన ప్రసారమే
విషయ విస్తృతికి మూలకం!.
గురువంటే మనుగడ నేర్పే మరయంత్రమా !కాదు..
మానవ గతులకు నైతికమల్లే
విలువల శిల్పి
గుండెలోతుల గుణగణాలను
తీర్చిదిద్దెటి నిత్యమహర్షి
అభిమానాలే ఆభరణాలుగ
నమస్కారమే సంస్కారముగ
సహనశీలమే సంస్కృతి చాటే ఉజ్వల భవితకు
పునాదులేసే సూత్రధారుడు.. !
కర్రపెత్తనం లేక పోయినా
కలం జులుంతో బలం ధరిత్రిగ
ఆశబారెడు ఆస్తి మూరెడు
ఆశయమంత అరాటాలే
అల్లరి చిల్లర సంతోషాలే
చీమల చూపుతు చెట్లను నాటుతూ
సమాజానికి చదవనే ప్రాణవాయువును
పంచుతున్న ప్రాతఃస్మరణీయుడు గురువు. ...!

-డా.పాండాల మహేశ్వర్
గౌసుకొండ పోచంపల్లి యాదాద్రి.

# బోధన.. ఓ ఆరాధన

గురు బ్రహ్మా
గురు విష్ణు
గురుదేవో మహేశ్వర
గురు సాక్షాత్ పరబ్రహ్మా
తస్మై శ్రీ గురవే నమః

ఇలా.. మనం గురవు గురించి గొప్పగా..చెప్పుకుంటాం.

ఆక్..శరం..

మెదడు లో దూరితే. జీవితమే వజ్రం.

వ్యక్తి జీవితాన్ని దేదీప్య మానం చేసేది విజ్ఞానం.

సదివినోడు ఎన్నడూ చెడడు..

సదువ లేని వాని కెరుక సదువు, సంధ్య విలువ అని..

విద్య విశిష్టత ను..విడమరచి.. చెప్పేవారు మా నాన్న మాచనఅభిమన్యు.

ఎవరు తనకు తారస పడినా?!

చదవడం మరవకు ..రా.!

చదువు మానకు

అని ఎందరికో పదే పదె చెప్పేవారు.

తన స్వంత డబ్బు తో, నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, ఏకరీతి దుస్తులు కొని ఇవ్వటమే గాక, విద్యార్థుల ను స్వంత బిడ్డ ల్లా చూసుకున్న.. అభిమాన ధనుడు.

అభ్యసించే, విద్య అర్థించే శిష్యులకు గురువే..జీవిత దిశ, దశ ను నిర్దేశించే దైవత్వం.

విద్వత్తు, తేజస్సు మూర్తీభవించిన బోధకులుగా శిష్యులకు ఉద్భోధ చేస్తారు ఉపాధ్యాయులు.అర్జునుడి విలు విద్య గొప్పతనం అతనికి, విద్య నేర్పిన ద్రోణాచార్యులదే.

వైద్య విద్యను అభ్యసించే వైద్య విద్యార్థులకు శరీర ధర్మ శాస్త్రము , ప్రాణాల్ని దక్కేలా చేసే వైద్యం బోధించే అధ్యాపకులకు ఇంకెంత సముచిత స్థానం దక్కాలి. చేతులు జోడించి నమస్కరించాలి.

అలాగే విద్య, వైద్య, వృత్తి విద్య, సాంకేతిక విద్య, ఇలా ఎన్నో రకాల విద్య లతో సాన పెట్టబడి ,సమాజానికీ కావలసిన సత్తాను తమ తమ విద్యార్థులకు అందించే ఉపాధ్యాయులు నిజంగా ధన్యులు.

ఢిల్లీ కి రాజైనా తల్లికి కొడుకే అన్న నానుడి



ఎలా ఉందో.. ఎంతటి వారు ఐనా సరే ఓ గురువుకు శిష్యులే. అందుకే బోధనా వృత్తి గురువుల ను ఆరాధినీచేలా చేస్తుంది. టీచర్లను, విద్యార్థులు అమితంగా ప్రేమించే లా, అభిమానించే లా ప్రీతి పాత్రుల్ని చేస్తుంది. ఈ విషయం ఒక ఉపాధ్యాయుడి కుమారుడుగా నేను స్వీయ అనుభూతి.

ఉపాధ్యాయ వృత్తి, ఎంతటి మహోన్నత గౌరవం ఇస్తుందంటే ఊరు కు ఊరే.. తమ కు జ్ఞానం ప్రసాదించిన సార్ కు ఊరేగింపు నిర్వహిస్తుంది.

ఓ..ముత్యాల కొమ్మ, ఓ మురిపాల రెమ్మ. ఓ...రాములమ్మ ,రాములమ్మ అన్న ఈ పాట ను రాసిన సుద్దాల అశోక్ తేజ పై. ప్రభుత్వ పురస్కారాల జల్లు కురిస్తే. ఊరు పుష్పాల బాట వేసి పూవుల వాన నే సార్ పై కురిపించింది.

బడి, పాఠ శాల, స్కూల్, కాలేజీ, కళాశాల, విశ్వవిద్యాలయం, యునివర్సిటీ ఇలా ఎన్నో పేర్లతో స్థాయిని బట్టి పిలుచుకునే సరస్వతీ సామ్రాజ్యాలకు తమ సర్వస్వం ధార పోసే ఉపాధ్యాయులు కానీ అధ్యాపకులు,ఆచార్యులు ఎంత వారైనా విద్యార్థుల ప్రేమ తో కరిగి పోయె వారే.

ఇంట్లో అమ్మా నాన్నా ప్రేమల కన్నా.. సార్ అని పిలిచే పిలుపులో జాలువారే అవినాభావ ఆప్యాయత అనురాగం విద్యార్థులను తన్మయత్వంలో ఓల లాడిస్తుంది. తల్లీ, తండ్రి కన్నా గురువు నే అధికంగా ఆదరించి, అభిమానించే వృత్తి బోధన ఒక్కటే. అందుకే గురు సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః అన్నారు. తన సొంత పిల్లల బాగోగుల కంటే తన ను ,తన ప్రేమైక బోధన నే తమ జీవితం అని నమ్మి అధ్యాపకులకు ప్రణమిల్లే విద్యార్థుల ప్రేమ, ఆదరణ లే ఉపాధ్యాయులను వీరూ..నా వాళ్ళే అన్న నమ్మిక కల్గిస్తాయి.

నేను స్వయంగా పండిత పుత్రున్ని కావడం నా పూర్వ జన్మ సుకృత మైతే. బడి, కళాశాల,విశ్వవిద్యాలయ వాతావరణాన్ని పలు కోణాల్లో ప్రేరణాత్మ కంగా పరిశీలించే మహద్భాగ్యం నాకు కలగడం నిజంగా సరస్వతీ కటాక్షమే. మాచన అభిమన్యు రంగారెడ్డి,మేడ్చల్ జిల్లా ల్లో ఆంగ్ల భాషా పండితులుగా పని చేసి తన ఆఖరి శ్వాస వరకూ..బడి గురించే కలవరి చేవారు . ఉపాధ్యాయ వృత్తి ధర్మం అనుసారం తన అనుభవ సారాన్ని విద్యార్థుల విజ్ఞాన వికాసానికి ధార పోశారు. 1975 నుంచి 2009 వరకు మైల్వార్, ఆలూర్, మహేశ్వరం, తుక్కుగుడా, రాంపల్లి దాయర, ఎదులబాద్,కుత్బుల్లాపూర్, షాపూర్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేసి ఆంగ్లం అంటే ఆమడ దూరం ఉండే గ్రామిణ విద్యార్థులను తన దైన శైలిలో గ్రామర్ కు, గ్లామర్ జోడించి బోధించారు. ఇంగ్లీషును ఇష్టపడేలా పాఠాలు చెప్పారు. అందుకే ఆనాటి రాష్ట్రపతి కలాం తో కలిసే అరుదైన అవకాశం దక్కించుకున్నారు. కలలో కూడా అనుకోలేదు ఓ మహోన్నత వ్యక్తి నీ అందునా భారత రాష్ట్ర పతిని కలిసే అవకాశం టీచర్ గా తనకు దక్కుతుందని భావించలేదు అని అభిప్రాయ పడ్డారు. ఎంతో ఆత్మ సంతృప్తి వ్యక్తం చేశారు.ఆ సంతుష్ట హృదయం తోనే దివికేగారు. ఇప్పటికీ ఎందరో విద్యార్థులకు అభిమన్యు ఆరాధనీయుడు అయ్యారు.

టీచర్ కొడుకుగా పుట్టడమే నా జన్మ పావనం అనుకున్న నాకు, కొంత కాలం ప్రతిష్టాత్మక జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కు పౌర సంబంధాల అధికారిగా పని చేసే భాగ్యం దక్కింది. మేధో ఉద్దండులైన సాంకేతిక శ్రష్టలు కొలువు దీరిన జే ఎన్ టీ యూ కు సేవ చేసే అవకాశం నాకు కలిగించారు అప్పటి ఉప కులపతి ఆచార్య డాక్టర్ కూడేరు రాజ గోపాల్. ఎన్నో వైసిష్ట్యాలతో అలరారే ఆ విశ్వవిద్యాలయం కు పని చేసింది మూడు సంవత్సరాలే ఐనా..నా జీవితం లో ఓ మైలు రాయి లా నిలిచింది. టీచర్ కొడుకును, పెద్దల విశ్వవిద్యాలయం కు పని చేసే అవకాశం దక్కడం ఓ అద్భుతం. ప్రపంచాన్ని తమ ప్రజ్ఞా పాటవాల ప్రదర్శనతో ప్రకాశింప జేయాలని ఉవ్విళ్లూరే యువ తరంగం జే ఎన్ టీ యూ ప్రాంగణం లో తమ తమ ప్రతిభ కు పదును పెట్టుకునే వారు. బోధన ను ఓ తపన గా భావించి , వజ్రాల్లాంటి మెరికలను భారతావని భవితకు అందించాలని ఆరాట పడే అధ్యాపకుల అనుపమాన భోదనాశక్తి ఆసక్తి అసాధారణ ప్రతిభ గల ఇంజనీర్లను అందించడానికి ఆరాట పడేది. నా స్టూడెంట్ గేట్ నేషనల్ టా పర్ అని అధ్యాపకులు ఎన్ వీ రమణా రావు ఎంతో ఆనందం వ్యక్తం చెయ్యడం ఇప్పటికీ మరవలేను.

మర్కట, మర్జాల సూత్రం విద్యార్థులకు విద్యార్జన లో ఆచర నీయ నియమం అని ఆచార్య డాక్టర్ కూడేరు రాజ గోపాల్ ఒక సందర్భంగా ఓ పాత్రికేయునికి ఇంటర్వ్యూ లో చెప్పిన పద్ధతి,చదువు నేర్చుకోవడం లో మెళకువలు ,విద్యార్థుల అధ్యాపకుల సమన్వయం ఎలా ఉండాలో తేట తెల్లం చేసింది.



-రఘునందన్ మాచన
9441252121

## గురువు

మూలం
సృష్టిలో పంచభూతాలు
నాలుగు వేదాలు
అష్ట దిక్కులు
అన్నిటిని నడిపేది గురువు
సృష్టి కారుడు బ్రహ్మ
లయకారుడు శివుడు
స్థితికారుడు కృష్ణుడు
ఈ మూడింటి కలబోతగురువు
ఒక డాక్టర్ ఒక యాక్టర్
దేవుణ్ణి గురించి బోధ
చేసిన గురువు నిజమైన దేవుడు
అందర్నీ సృష్టించే విధాతప్రదాత
చర చర సృష్టి నిర్మాత
అజ్ఞానపు చీకట్లను చీల్చి
వెలుతురును ప్రసరించే
ఉషస్సు గురువు
వందనం ,పధాభివందనం

-ఉమాశేషారావు వైద్య

## సృష్టి కర్త

మనిషిని మనిషిగా మార్చే మహనీయుడు
మనిషి మృగం కాకుండా చూసే మహానుభావుడు
మనలో విజ్ఞానాన్ని వికసింప చేసే శక్తి మంతుడు
మనలో జ్ఞానాన్ని సృష్టించే బ్రహ్మ స్వరూపుడు
మనలో అజ్ఞానాన్ని రూపు మాపి
విజ్ఞానమనే వెలుగును నింపే దేవుడే గురువు
హృదయ పూదోటలో పెరిగే
కుసుమాలకు తోటమాలి
పిల్లలకు జ్ఞానమనే జలాన్ని పోస్తూ..
విజ్ఞానమనే విదులను బోధిస్తూ
క్రమశిక్షణతో నడిపిస్తూ
భావిభారత పౌరులుగా తయారుచేసే మహనీయుడు
మాతృభాషలోని మాధుర్యాన్ని చవిచూపిస్తూ.
వెలుగును అందిస్తూ...
పిల్లల సేవలో తన జీవితం ధన్యమని భావిస్తూ
తల్లిలా లాలిస్తూ తండ్రిలా రక్షిస్తూ..
మిత్రునిలా చేరదీసి.. అప్తునిగా ఆరాధిస్తూ
తన వృత్తిని పిల్లలకి అంకితం చేసే
గురువులకి గురుపూజోత్సవ శుభాకాంక్షలు

-అనిత దావాత్
9394221927-

# అవకాడోలుతో పిల్లల్లో శారీరక పెరుగుదల - మెదడు వృద్ధికి అవసరమైన పోషకాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 4:అవకాడోలుతో పిల్లల్లో శారీరక పెరుగుదల – మెదడు వృద్ధికి అవసరమైన పోషకాలు కూడా.. హైదరాబాద్, సెప్టెంబరు 2, 2023: పసిపిల్లల ఆహారంలో భాగంగా అవకాడోలు పెడితే శారీరక పెరుగుదలకు కావాల్సిన కేలరీలను అందించడమే కాకుండా ఇందులో ఉండే కొవ్వు మెదడు వృద్ధికి ఎంతగానో తోడ్పడనుందని కన్సల్టెంట్ న్యూట్రిషనిస్ట్ హెనా నఫీస్ తెలిపారు. బిడ్డకు పాలు పట్టడం చాలా ఉత్తేజకరమైనదని, ఒక్కోసారి సవాలుతో కూడుకున్నదని తెలిపారు. శిశువు ఆహారం ఆకర్షణీయంగా ఉండటం చాలా ముఖ్యమన్నారు. అవి పెరుగుదల, అభివృద్ధికి తోడ్పడే పోషకాలతో సమృద్ధిగా ఉండాలన్నారు. అవకాడోలు ఈ పరిధిలోకి వస్తాయన్నారు. ఆకుపచ్చ పోషకాలతో నిండిన పండు బిడ్డకు ఉత్తమమైన ఆహారమన్నారు. భారతదేశంలో విద్యా ప్రచారంలో భాగంగా వరల్డ్ అవకాడో ఆర్గనైజేషన్ కొన్ని రుచికరమైన వంటకాలతో పాటు అవకాడోల ప్రయోజనాలను తెలియజేస్తుందన్నారు. ఇది అత్యంత రక్షిత విటమిన్ సీ కంటెంట్తో పిల్లల రోగనిరోధక శక్తికి సపోర్ట్ చేయనుందన్నారు. అవకాడోలు అధిక శక్తిని కలిగి ఉంటాయన్నారు. చిన్నపాటి ఆకలితో ఉన్న పిల్లలకు, గజిబిజిగా తినే పిల్లలకు ఇది ఒక ఆదర్శవంతమైన ఆహారం అవుతుందని తెలిపారు. ఇది సులభంగా ప్యూర్ చేయబడుతుందన్నారు. శిశువుకు కాన్పు కోసం వెళుతున్నట్లయితే.. మొదటిసారి తినేవారికి అవకాడో ముక్కలను అందించవచ్చని పేర్కొన్నారు. అవకాడో స్టిక్స్ వంటి వెజిటబుల్ క్రూడిట్లు పిల్లలకు చేయి, కన్ను, నోరు తాలుకా సమన్వయం నైపుణ్యాలను అభివృద్ధి చేయుడంలో సహాయపడతాయని తెలిపారు. అవకాడోలు ఆరోగ్యకరమైన మోనోశాచురేటెడ్ కొవ్వు ఆమ్లాలను కలిగి ఉంటాయన్నారు. ఇవి శిశువుల మెదడు, నరాలు, కంటి ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. ఏ,డీ,ఈ,కే వంటి విటమిన్లు.. ఇవన్నీ పిల్లల ఎదుగుదల, అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆరోగ్యకరమైన కణాల అభివృద్ధికి ఫోలేట్, రోగనిరోధక వ్యవస్థ, గుండె, ఎర్ర రక్త కణాలు, చర్మం, వెంట్రుకలకు సరిపడ విటమిన్ ఈ, కే అధికంగా ఉంటాయన్నారు. ఇది రక్తం గడ్డకట్టడానికి, ఎముకల నిర్మాణానికి అవసరమైనదన్నారు. ఈ గ్రీన్ సూపర్ఫుడ్ విటమిన్ సీ, బీ6, బీ1, బీ5, బీ2, బీ3లకు మూలమన్నారు. గ్రాముకు గ్రాము, అరటిపండ్ల కంటే అవకాడోస్లో ఎక్కువ పొటాషియం ఉంటుందన్నారు. అవకాడోలో మెగ్నీషియం కూడా ఉంటుందన్నారు. ఇది ఆరోగ్యకరమైన నాడీ వ్యవస్థ, కండరాల పనితీరు, రోగనిరోధక వ్యవస్థ, గుండె ఆరోగ్యానికి తోడ్పడనుందన్నారు. అవోకాడోస్లోని అధిక ఫైబర్ కంటెంట్ శిశువు జీర్ణవ్యవస్థకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు.

# నేను అధ్యక్షుడినైతే.. ట్రంప్ను క్షమిస్తా : వివేక్ రామస్వామి

న్యూ డిల్లీ సెప్టెంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): );అమెరికా దేశాధ్యక్ష ఎన్నికల్లో భారత్కు చెందిన వివేక్ రామస్వామి రిపబ్లికన్ పార్టీ తరపున బరిలో ఉన్న విషయం తెలిసిందే. ఆ పార్టీ అభ్యర్థిత్వం కోసం ఆయన పోటీపడుతున్నారు. ఇందులో భాగంగా తన ప్రచారాన్ని ముమ్మరంగా సాగిస్తున్నారు. వరుస ఇంటర్వ్యూలు, చర్చా వేదికల్లో పాల్గొంటున్నారు. వివిధ అంశాల గురించి తన ఆలోచనలను పంచుకుంటూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఏబీసీ న్యూస్ నిర్వహించిన చర్చా వేదికలో పాల్గొన్న వివేక్ రామస్వామి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున తానే బరిలో దిగవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవేళ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థిగా నామినేట్ అయితే ఆయనకు మద్దతిస్తానని స్పష్టం చేశారు.అదేవిధంగా తాను అధ్యక్షుడిగా ఎన్నికైతే ప్రస్తుతం అనేక చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్న ట్రంప్ను క్షమిస్తానని ప్రకటించారు. 'వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థిగా నామినేట్ అయితే నేను అతనికి మద్దతు ఇస్తాను. నేను అధ్యక్షుడిని అయితే న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటున్న ట్రంప్ను క్షమిస్తాను. ఎందుకంటే అది దేశం మళ్లీ ఏకం కావడానికి సహాయపడుతుంది. తదుపరి దేశాధ్యక్షుడిగా నేను చేయబోయే అతి ముఖ్యమైన విషయం ఇది కాకపోవచ్చు. కానీ, ఇది దేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అవసరం' అని రామస్వామి ఏబీసీ న్యూస్తో అన్నారు.

# బిసి గర్జన పోస్టర్ను విడుదల చేసిన మంత్రి గంగుల



కరీంనగర్, సెప్టెంబర్ 4:10వ తేదీన హైదరాబాదులోని సరూర్నగర్ స్టేడియంలో జరిగే బీసీల సింహ గర్జన పోస్టర్ను రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. ఈ సింహగర్జనను ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపు ఇచ్చారు..

లఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంగం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, ప్రధాన కార్యదర్శి దుగ్గలి శ్రీధర్ ,బీసీ సంక్షేమ సంగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ గాజె రమేష్, మహిళా అధ్యక్షురాలు అరుణ, జిఎస్ ఆనంద్, రమేష్ గౌడ్, మంద వెంకన్న మురళి, ప్రశాంత్, సతీష్, గాజె ప్రజోత్, తిరుపతి, జ్యోతి తదితరు పాల్గొన్నారు,

# ఎన్ ఆర్ ఐ లకు ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడానికి భారతదేశం ఎందుకు గమ్యస్థానంగా ఉండాలి.

హైదరాబాద్, సెప్టెంబర్ 4:భారతదేశానికి వలసలు కొత్త కాదు – ఉన్నత విద్య, ఉద్యోగాలు లేదా వ్యాపార అవకాశాల కోసం వలసలు సాగుతూనే ఉంటాయి. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం, ప్రతి సంవత్సరం సుమారు 25 లక్షల మంది ప్రజలు విదేశాలకు వలస వెళుతున్నారు, ఇది ప్రపంచంలోనే అత్యధిక వార్షిక సంఖ్యగా నిలిచింది. నిజానికి, గల్ఫ్ దేశాలు, ముఖ్యంగా యు ఎ ఈ, పెద్ద సంఖ్యలో ఎన్ ఆర్ ఐలకు నిలయంగా ఉన్నాయి. కుటుంబ సంబంధాల కారణంగా భారతదేశానికి తిరిగి రావడానికి లేదా తరచుగా విస్తృత పర్యటనలు చేసేవారికి కూడా కొరత లేదు. అటువంటి సందర్భాలలో, ఎన్ ఆర్ ఐలు తమ నివాస దేశంలో లేదా భారతదేశంలో ప్లాన్ను కొనుగోలు చేయడం గురించి తరచుగా గందరగోళాన్ని ఎదుర్కొంటారు. దీనికి సమాధానం ఎన్ ఆర్ ఐలు ఫాల్–బ్యాక్ ఎంపికగా భారతదేశం నుండి ఆరోగ్య ప్రణాళికలో పెట్టుబడి పెట్టాలి.

సిద్ధార్థ్ సింఘాల్, బిజినెస్ హెడ్ – హెల్త్ ఇన్సూరెన్స్, పాలసీ బజార్ డాట్ కామ్ మాట్లాడుతూ "భారతదేశం దాని స్థోమత మరియు ఆరోగ్య సంరక్షణ నాణ్యత కారణంగా ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడానికి ఎన్ ఆర్ ఐలకు గమ్యస్థానంగా ఉంది. వారి అవసరాలకు అనుగుణంగా విభిన్న పాలసీల లభ్యత మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. బీమా సంస్థలు కూడా వైద్య పరీక్షలు అవసరం లేకుండానే హెల్త్ పాలసీలను అందిస్తాయి, కొనుగోలు ప్రక్రియను మెరుగుపరుస్తాయి. అయితే, భారతదేశంలో కొనుగోలు చేసిన చాలా ఆరోగ్య పాలసీలు దేశంలోని చికిత్సలకు కవరేజీని అందజేస్తాయని గమనించడం ముఖ్యం. భారతదేశం నుండి ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడం యొక్క ప్రధాన ప్రయోజనాల్లో ఒకటి కొనుగోలుదారులు 18% జిఎస్ టి వాపసు పొందటం. ప్రస్తుతం, మణిపాల్ సిగ్నా, ఏ బి హెచ్ ఐ మరియు నివ భూప అనేవి 18% జిఎస్ టి రీఫండ్తో ఎన్ ఆర్ ఐ హెల్త్ ఇన్సూరెన్స్ను అందించే మూడు భీమా సంస్థలు గా నిలిచాయి" అని అన్నారు

# కాకినాడలోని ఎస్.ఆర్.ఎమ్.టీ ఐనాక్స్ మాల్లో షో ప్రీ-లాంచ్ ..

## - హీరో విశ్వక్ సేన్ "ఫ్యామిలీ ధమాకా"



కాకినాడ, సెప్టెంబరు 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: డైనమిక్ హీరో విశ్వక్ సేన్ హోస్ట్గా రాబోతున్న కొత్త షో "ఫ్యామిలీ ధమాకా" ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన లాంచ్ని ప్రకటించినందుకు ఆహా థ్రిల్గా ఉంది. ఇది ఓటిటి ప్రపంచంలోకి విశ్వక్ సేన్ యొక్క తొలి షో కావడం, వీక్షకులకు తాజా మరియు ఉత్తేజకరమైన అనుభవాన్ని అందిస్తుంది."ఫ్యామిలీ ధమాకా" సెప్టెంబర్ 8న రాత్రి 8 గంటలకు ప్రీమియర్ ప్రారంభం అవుతుంది. ఇది ప్రేక్షకులకు మరియు కుటుంబ మొత్తానికి వినోదాన్ని అందిస్తుంది. అయితే, ఆహా గోల్డ్ సబ్స్క్రైబర్లు సెప్టెంబరు 7న మొదటి ఎపిసోడ్ని ఆస్వాదించే ప్రత్యేకత ఉంటుంది. ఆహా గోల్డ్, కేవలం రూ. 899కి అందుబాటులో ఉంది, 4ఐ డాల్బీ ఆడియో, యాడ్-ఫ్రీ స్ట్రీమింగ్ మరియు తెలుగు మరియు తమిళ ప్లాట్ఫారమ్లకు ఒక సంవత్సరం యాక్సెస్ పొందే అవకాషాన్ని అందిస్తుంది.కాకినాడలోని రాఖీఓ ఏఔాచీ మాల్లో జరిగిన ఆహ్లాదకరమైన ప్రీ-లాంచ్ ఈవెంట్లో, ఆహా కాకినాడలోని కుటుంబాలతో కలిసి ఫ్యామిలీ ధమాకా యొక్క ఉత్తేజకరమైన గేమ్లో పాల్గొన్నారు, ఆ తర్వాత షో యొక్క ఆకట్టుకునే థీమ్ సాంగ్తో కూడిన వైబ్రెంట్ వేడుక. ఈవెంట్ అద్భుతమైన విజయాన్ని సాధించింది మరియు రాబోయే వాటికి వేదికగా నిలిచింది అని నిర్వహకులు తెలిపారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.